క్లుప్తంగా

17 నుంచి భీమేశ్వర కల్యాణ మహోత్సవాలు

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయంవీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 17 నుంచి 22 వరకూ స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాలు జరుగుతాయని ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వర రావు గురువారం విలేకర్లకు తెలిపారు. బ్రహ్మశ్రీ తనికెళ్ల బుచ్చి వెంకటశాస్త్రి, ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో కల్యాణమహోత్సవాలు జరుగుతాయన్నారు. భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ వేసవి శిక్షణ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): స్థానిక లేడీస్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలోని ద్రోణాచార్య బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 10 నుంచి నిర్వహిస్తున్న బ్యాడ్మింటన్ వేసవి శిక్షణ శిబిరం గురువారంతో ముగిసిందని నిర్వాహకులు గమిని చినరాజా తెలిపారు. ఈ శిబిరంలో 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి డాక్టర్ అద్దాల సత్యనారాయణ ముఖ్య అతిథిగా, గౌరవ అతిథిగా వికాస ప్రాజెక్టు డైరెక్టర్ లచ్చారావు హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రంగబాబు, చీఫ్ కోచ్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

89వ సారి తాతీలు రక్తదానం



కాకినాడలో రక్తదానం చేస్తున్న తాతీలు

కరప: గ్రామ మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు గురువారం 89వ సారి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. బిక్కవోలు మండలం బాలవరం గ్రామానికి చెందిన మేడిశెట్టి అమ్ములు బ్రెయిన్ సర్జరీ నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు అత్యవసరంగా బ్లడ్ అవసరంకాగా ఆమె బంధువులు తాతీలును సంప్రదించారు. ఆయన వెంటనే స్పందించి బ్లడ్‌బ్యాంక్‌కు వెళ్లి రక్తదానం చేశారు. బ్లడ్‌బ్యాంక్ అధికారులు డాక్టర్ బి.శ్రీహరిబాబు, డాక్టర్ జి.లక్ష్మి, ల్యాబ్‌టెక్నీషియన్ హరిబాబుల సమక్షంలో అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని 89వ సారి రక్తదానం చేసినట్టు తాతీలు తెలిపారు.

ఎన్నికల కమిషన్ వివరణ ఇవ్వాలి

బోట్‌క్లబ్: పోలింగ్ జరిగిన ఓటర్ల సంఖ్యకు ఫలితాల లెక్కింపు రోజు ప్రకటించిన ఓట్లకు వచ్చిన తేడాపై భారత ఎన్నికల కమిషన్ ప్రజలకు వివరణ ఇవ్వాల్సిన బాధ్యత ఉందని పౌర సంక్షేమ కన్వీనర్ దూసర్లపూడి రమణ రాజు గురువారం డిమాండ్ చేశారు. ఈవీఎంలపై ప్రజల్లో నెలకొన్న సందేహాలు నివృత్తి చేయాలన్నారు. దేశ వ్యాప్తంగా 140 పార్లమెంట్ స్థానాల్లో లెక్కలు తేడా వచ్చాయన్న విశ్వసనీయ వార్తలపై 72 గంటలైనా ఎన్నికల కమిషన్ నుంచి స్పందన లేకపోవడం తగదన్నారు. 2019లో ఓటమికి గురైన చంద్రబాబు, 2024లో అధికారం కోల్పోయిన జగన్‌మోహన్ రెడ్డి ఈవీఎంలపై సందేహాలు వ్యక్తం చేయడం గమనించాల్సిన విషయమన్నారు.

ప్రపంచ కుట్టు యంత్రం దినోత్సవం



మహిళలకు కుట్టు మెషీన్లను అందజేస్తున్న రత్నప్రసాద్ తదితరులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలోని అడబాల ట్రస్ట్ కార్యాలయంలో గురువారం ప్రపంచ కుట్టు యంత్రాల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం ద్వారా కుట్టు శిక్షణ ఇస్తున్న శ్రీలక్ష్మిని ట్రస్ట్ నిర్వాహకుడు అడబాల రత్నప్రసాద్ సన్మానించారు. అనంతరం లాటరీ ద్వారా ఇద్దరికి కుట్టు మెషీన్లను అందజేశారు.

'ఉపాధి' వేతన బకాయిలు చెల్లించాలి

కరప: ఉపాధి వేతనాలు చెల్లించక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టేకుమూడి ఈశ్వరరావు, కేఎస్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.కృష్ణ, చోడిశెట్టి కృష్ణలతో కలసి వారు పాతర్లగడ్డ, గొర్రిపూడి, వలసపాకల, సిరిపురం, జి.భావారం గ్రామాల్లో గురువారం పర్యటించి ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

బడి బాటన బాలలు

- బడి గంటలు మోగిన వేళ బిలబిలమంటూ వచ్చిన విద్యార్థులు
- పుస్తకాలు, యూనిఫాంతో పై తరగతులకు.. కొత్త గదులకు..



వాకలపూడి హైస్కూల్‌లో కొత్త అడ్మిషన్ల హడావుడిలో ఉపాధ్యాయులు



కాకినాడ రూరల్‌లో పాఠశాలలకు పాఠ్య పుస్తకాల పంపిణీ ఏర్పాట్లలో ఉపాధ్యాయులు

కాకినాడ రూరల్: వేసవి సెలవులు ముగిశాయి.. బడి గంటలు మోగాయి. సర్కారు పాఠశాలలు గురువారం తెరుచుకున్నాయి. సెలవుల్లో బంధువులు, అమ్మ, నానమ్మ ఊళ్లకు వెళ్లి సందడి చేసిన విద్యార్థులు ఇప్పుడు తమ భవిష్యత్‌కు బాటలు వేసుకునే దిశగా బడిబాట పట్టారు. కాకినాడ రూరల్ మండలంలో గురువారం ఉదయం పాఠశాలలు వద్ద విద్యార్థుల సందడి నెలకొంది. మండలంలో మొత్తం 14 ప్రభుత్వ, జెడ్పీ పాఠశాలలు, 4 ఎంపీపీ పాఠశాలలు, 52 ప్రాథమిక పాఠశాలలతో పాటు బాలికల గురుకుల పాఠశాల ఉంది. బడులు తెరవడంతో విద్యార్థులు వడివడిగా వచ్చేశారు. మండల పరిధిలో 8439 మంది విద్యార్థులు ఉన్నారు. గత ఏడాది సుమారు 9 వేల మంది ఉన్నారు. విద్యార్థులకు సరిపడే పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం, బూట్లు ఇప్పటికే చేరుకున్నాయి. ఏడో తరగతికి సంబంధించి పాఠ్య పుస్తకాలు మాత్రం ఇంకా రాలేదు. బడులు తెరవడంతో అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు అందించేందుకు ఉపాధ్యాయులు ఏర్పాట్లు చేస్తున్నారు. వాకలపూడిలోని జెడ్పీ ఉన్న పాఠశాలలో ఉంచిన పుస్తకాలను పాఠశాలలకు పంపుతున్నారు. మండల అదనపు విద్యాశాఖ అధికారి ఏసుదాసు పర్యవేక్షణలో పుస్తకాల పంపిణీ చేపట్టారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా పుస్తకాలు వచ్చినట్టు ఆయన తెలియజేశారు.

ఉత్సాహంగా చదువుకునేందుకు పాఠశాలకు..



మాది వలసపాకల గ్రామం. వాకలపూడి హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాను. వేసవి సెలవులు ముగియడంతో మళ్లీ చదువుకు సిద్ధమై వచ్చాను. తోటి విద్యార్థినులతో తొలి రోజు సరదాగా గడిపాను.

– వి.ఉమశ్రీ, 9వ తరగతి విద్యార్థిని, వాకలపూడి హైస్కూల్

అడ్మిషన్లు జరుగుతున్నాయి



కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైంది. మా పాఠశాల నుంచి పదో తరగతి పూర్తి చేసిన వారితో పాటు మొత్తం 140 మంది విద్యార్థులు బయటకు వెళ్లారు. కొత్తగా వంద మంది వరకు చేరే అవకాశం ఉంది. తొలి రోజు పది మంది చేరారు. గత ప్రభుత్వ హయాంలో కాలనీలో కొత్తగా ఇళ్లు నిర్మించుకున్న వారు అక్కడ పాఠశాలల్లో చేరేందుకు టీసీలు తీసుకున్నారు.

– టీఎస్ఎన్ మూర్తి, హెచ్ఎం, వాకలపూడి

స్టూడెంట్ కిట్ల తరలింపు



కరప స్టాక్ పాయింట్ నుంచి స్టూడెంట్ కిట్లను పాఠశాలలకు తరలిస్తున్న ఎంఈఓలు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్ నుంచి విద్యార్థి కిట్లను గురువారం మండల పరిధిలోని పాఠశాలలకు తరలించారు. మండలంలో 51 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 9 ఉన్నత పాఠశాలలు ఉన్నాయని, ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు పంపిణీ చేసేందుకు వచ్చిన విద్యార్థి కిట్లు (పాఠ్య పుస్తకాలు, నోటుపుస్తకాలతో పాటు, మొదటి విడతగా వచ్చిన షూస్, సాక్స్) పంపించినట్టు ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ తెలిపారు. సీఆర్పీలు పి.రాజు, పి.సత్యనారాయణ, బి.సారాకుమారి, వై.నాగలక్ష్మి, పి.సునీత తదితరులు పాల్గొన్నారు.

పాలు కల్తీ చేస్తే కేసు

- ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సుబ్బారావు
- సర్పవరంలో పలు దుకాణాల్లో తనిఖీ



కాకినాడ రూరల్: పాలు కల్తీ చేస్తే చట్టపరంగా కేసులు పెడతామని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సుబ్బారావు వెల్లడించారు. స్థానిక సర్పవరం గ్రామంలో శ్రీ అన్నపూర్ణ మిల్క్ సప్లయ్ దుకాణంలో పాలు కల్తీ చేస్తున్నారని వచ్చిన ఫిర్యాదుల మేరకు ఫుడ్ సేఫ్టీ అధికారులు గురువారం తనిఖీ చేశారు. పాలలో వెన్న శాతం వచ్చే మెషీన్‌లో పరిశీలించి, ఆవు పాలు, గేదె పాలను పరీక్షించి, లేబొరేటరీకి పంపించారు. అనంతరం అపరిశుభ్రంగా ఉన్న సప్లై కేంద్రాన్ని, పాలల్లో పడిన ఈగలను అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా సేఫ్టీ ఆఫీసర్ సుబ్బారావు మాట్లాడుతూ వినియోగదారులు పాలు కోనేటప్పుడు వాటి రంగు, రుచి గుర్తించాలని అలాగే పాలలో కల్తీ చేసినట్టు అనుమానం వచ్చిన వెంటనే నాగమల్లి తోట జంక్షన్‌లోని పైడా వారి వీధిలో ఉన్న ఫుడ్ అండ్ సేఫ్టీ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఇప్పుడు తనిఖీ చేసిన పాలను ల్యాబ్‌లో టెస్ట్‌కు పంపించామని, రిపోర్ట్సులో కల్తీకి పాల్పడినట్లు వస్తే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కురసాల కన్నబాబు



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

- మాజీ మంత్రి కురసాల కన్నబాబు
- నాయకులు, కార్యకర్తలకు భరోసా

కాకినాడ రూరల్: కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దని మాజీ మంత్రి కురసాల కన్నబాబు కోరారు. రమణయ్యపేటలోని వైద్యనగర్‌లోని పార్టీ కార్యాలయం వద్ద గురువారం సాయంత్రం వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ గెలుపు ఓటములు సహజమని, 40 శాతం ఓటర్లు తమకు అండగా నిలిచారని, వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో కష్టపడిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం చోటు చేసుకుంటున్న పరిణామాల పట్ల అధైర్యపడవద్దన్నారు. ఎవరైనా కవ్వింపు చర్యలకు పాల్పడినా సంయమనం పాటించాలన్నారు. మళ్లీ మన నాయకుడు అధికారంలోకి వస్తారని, భవిష్యత్ మనదేనని నాయకులు, కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. పార్టీ కోసం కష్టపడి పనిచేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజల్లో ఉండాలని కోరారు. సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి కూడా మన వంతుగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీలు నురుకుర్తి రామకృష్ణ, యాళ్ల సుబ్బారావు, కరప ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ బందిల విరీషా, నాయకులు కురసాల కల్యాణ్ కృష్ణ, మాజీ మేయర్ సరోజ, గీసాల శ్రీను, గోపిశెట్టి బాబ్జీ, బెజవాడ సత్యనారాయణ, అనుసూరి ప్రభాకర్, గీసాల శ్రీనివాసరావు, పి.నాగబాబు, ఊబా జాన్, పుల్ల ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ముద్దాడను కలిసిన ఏపీఎన్‌జీవో నేతలు



ముద్దాడ రవిచంద్రకు అభినందనలు తెలుపుతున్న రాష్ట్ర, జిల్లా ఏపీ ఎన్‌జీవో నేతలు

కాకినాడ క్రైం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ నాయకులు, రాష్ట్ర నాయకత్వంతో కలిసి గురువారం ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ, సీఎం పీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన ముద్దాడ రవిచంద్రను విజయవాడలోని ఏపీ సెక్రటేరియట్‌లో కలిసి అభినందనలు తెలిపారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కలసిన వారంతా అన్ని వర్గాల అభివృద్ధిని కాంక్షిస్తూ బాధ్యతలను నిర్వర్తించాలని ఆకాంక్షించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం నాయుడు, ఉపాధ్యక్షుడు ఎన్వీ రమణ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహన్, జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, సహాధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పాలపర్తి మూర్తిబాబు, సర్వెళ్ల చంద్రరావు, కేఎస్‌వీ ప్రసాద్, జిల్లా ట్రెజరీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పాము శ్రీనివాస్ ఉన్నారు.

రోడ్లపై చెత్త కనిపిస్తే జరిమానా

- ప్రజలు సహకరిస్తేనే నగర శుభ్రత
- మున్సిపల్ కమిషనర్ వెంకటరావు
- పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీ
- శానిటరీ సెక్రటరీకి షోకాజ్



రోడ్డుపై డెబ్రిస్ వేయవద్దని స్థానికులకు సూచనలిస్తున్న కమిషనర్ వెంకటరావు

కాకినాడ: చెత్తను రోడ్లపై, డ్రైనేజీలలో వేస్తే జరిమానా విధిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు హెచ్చరించారు. గురువారం ఆయన కాకినాడ నగరంలో పారిశుద్ధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జగన్నాథపురం, ఏటిమొగ సినిమా రోడ్డు, శ్రీరామ్‌నగర్ ప్రాంతాలలో ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్‌తో కలిసి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. కొన్నిచోట్ల చెత్తను రోడ్లపై వేయడాన్ని గుర్తించారు. ఇంటింటికీ చెత్త సేకరణ కోసం డస్ట్‌బిన్లను సమకూర్చి ఇళ్ల వద్దకే పారిశుద్ధ్య సిబ్బందిని పంపిస్తున్నా చెత్తను ఇలా రోడ్లపై వేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోసారి ఇలా పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆయా ప్రాంతాల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కార్యదర్శులను ఆదేశించారు. చెత్తను రోడ్లపై వేసే వారికి జరిమానా విధించాలని సూచించారు. పలు ప్రాంతాలలో పారిశుద్ధ్య నిర్వహణలో లోపాలను గుర్తించారు. ఇందుకు బాధ్యులైన ఓ శానిటరీ సెక్రటరీకి షోకాజ్ నోటీస్ ఇవ్వాలని ఎంహెచ్‌ఓను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మెరుగైన పారిశుధ్య సేవల కోసం నగరపాలక సంస్థ తరపున ఎన్నో పాలనా సంస్కరణలు అమలు చేస్తున్నామన్నారు. ప్రధానంగా ఇంటింటికీ చెత్త సేకరణ కోసం హూపర్ టిప్పర్ వాహనాలను ఏర్పాటు చేశామని, కార్మికులే ఇళ్ల వద్దకు వచ్చి చెత్తను తీసుకువెళ్తున్నారన్నారు. ఇలాంటి సమయంలో ప్రజలు కూడా తగిన సహకారం అందించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ప్రజలు పారిశుద్ధ్య విభాగం మధ్య సమన్వయం ఉంటే మరిన్ని మెరుగైన సేవలు అందించగలమని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పలు మస్తరు కేంద్రాలను కూడా కమిషనర్ సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీ చరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ధర్మాజీ, ఆయా సచివాలయ శానిటరీ సెక్రటరీలు ఉన్నారు.

తడి–పొడి చెత్తను వేరువేరుగా ఇవ్వండి

- డస్ట్‌బిన్‌లను కచ్చితంగా వినియోగించండి
- అవసరమైతే వాటిని సమకూరుస్తాం
- ప్రజలకు కమిషనర్ సూచన

కాకినాడ: ఇంటింటికీ చెత్త సేకరణలో భాగంగా సమకూర్చిన డస్ట్ బిన్లను తప్పనిసరిగా వినియోగించాలని కమిషనర్ వెంకటరావు ప్రజలకు సూచించారు. ఘన, వ్యర్థ పదార్థాల నిర్వహణలో భాగంగా ప్రతి ఇంటికీ మూడేసి డస్ట్ బిన్‌లను గతంలోనే అందజేశామని, తడి–పొడి చెత్త, హానికర వ్యర్థాలను వేరువేరుగా ఆయా డస్ట్ బిన్లలో మాత్రమే వేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలని స్పష్టం చేశారు. కొన్నిచోట్ల డస్ట్ బిన్లను వినియోగించకుండా రోడ్ల పక్కనే చెత్తను వేస్తున్నారని, అలా చేయవద్దని సూచించారు. ఎక్కడైనా ప్రజలకు డస్ట్‌బిన్‌లు అందకపోతే సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేదా శానిటరీ సెక్రటరీలను సంప్రదించవచ్చునని కోరారు. చెత్తను రోడ్లపైన, డ్రైనేజీలలోను వేయకుండా డస్ట్ బిన్లలో మాత్రమే తడి–పొడి చెత్తను వేరువేరుగా వేసి నగరపాలక సంస్థకు సహకరించాలని కమిషనర్ కోరారు. ప్రజల సహకారం కూడా ఉన్నప్పుడే మెరుగైన పారిశుధ్య సేవలు అందించగలమని ఆయన స్పష్టం చేశారు.

వేంకటేశుని కల్యాణానికి శ్రీకారం



స్వామివారి కల్యాణానికి పందిరిరాట వేస్తున్న గ్రామస్తులు

కరప: మండలం కొంగోడులో కొలువైన శ్రీ, భూ సమేత వెంకటేశ్వరస్వామి దివ్య కళ్యాణోత్సవానికి గురువారం శ్రీకారం చుట్టారు. ముత్తైదువులు పసుపు కొట్టగా, గ్రామపెద్దలతో కలసి ఆలయ అర్చకులు పెద్దింటి రామానుజాచార్యులు పెండ్లి పందిరికి రాట ముహూర్తం చేశారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. 17వ తేదీ రాత్రి 8.30 గంటలకు స్వామివారి కళ్యాణం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. గ్రామపెద్దలు మాజీ సర్పంచ్ మేడిశెట్టి సుబ్బరాజు, నక్కా గోవిందు, మాజీ ఎంపీటీసీలు అట్ల గోవిందరాజులు, మేడిశెట్టి సత్తిరాజు, ఎం.వీరభద్ర వెంకట్రావు, టి.సుబ్బారావు తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అక్రమ ఆక్వా సాగును అరికట్టాలి



కొరిపల్లిలో రొయ్యల చెరువుల నుంచి వచ్చే వ్యర్థాలతో మురుగు కూపంగా మారిన రావువారి పంటకాలువ

కరప: మండలం కొరిపల్లిలో అక్రమ ఆక్వా సాగును అరికట్టి, రొయ్యల చెరువుల నుంచి వ్యర్థాల వల్ల నాశనమవుతున్న తమ పంట పొలాలను పరిరక్షించాలని ఆ గ్రామ రైతులు గురువారం అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో సుమారు 60 ఎకరాలు చేపల సాగుకు అనుమతులు తీసుకుని, అనధికారికంగా రొయ్యల సాగుచేస్తున్నారు. ఈ చెరువుల నుంచి వ్యర్థాలను రావువారి పంటకాలువలోకి వదలటం వల్ల తమ పంట భూములు సారం కోల్పోతున్నాయని ఆ గ్రామ రైతులు దేవిశెట్టి సీతారామాంజనేయులు, తోట కృష్ణ, దేవిశెట్టి కొండలరావు, కడియాల సత్యనారాయణ తదితరులు ఆరోపించారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



నడకుదురు జనావళి వృద్ధాశ్రమంలో దుస్తులు పంపిణీ చేస్తున్న విజయరాజు

కరప: మండలం నడకుదురులోని జనావళి వృద్ధాశ్రమంలోని 15 మంది వృద్ధులకు కాకినాడ దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజు అన్నదానం చేసి, దుస్తులు, నగదును అందజేశారు. ఆశ్రమ నిర్వాహకుడు మందపల్లి శ్యామ్‌ను విజయరాజు అభినందించారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణీంద్రకుమార్, ఈఓలు కె.తిరుమల రవితేజ, సీహెచ్ వెంకటరమణమూర్తి, వడ్డాది సత్తిబాబు, డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఎంఈఓ మృతి



వాణీకుమారి (ఫైల్)

సామర్లకోట: మండల విద్యాశాఖాధికారిగా పని చేసి పదవీ విరమణ చేసిన వాణీకుమారి గురువారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం ఇంటి వద్ద మృతి చెందారు. ఆమె మృతికి ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, ఎంఆర్‌సీ సిబ్బంది, సీఆర్పీ సిబ్బంది, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

మానవ సేవే మాధవ సేవ

డాక్టర్ ఉమర్ ఆలీషా

పిఠాపురం: మానవ సేవే.. మాధవ సేవ అని శ్రీవిశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. స్థానిక పీఠం ఆవరణలో గురువారం సేవా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎవరికి తోచిన విధంగా వారు ఇతరులకు సేవ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడేనికి చెందిన కిడ్నెస్ సొసైటీ అధ్యక్షుడు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా లయన్స్ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, సరోజిని దంపతుల సౌజన్యంతో వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న 153 మంది మహిళలకు ఆయన చీరలు పంపిణీ చేశారు. ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు, కిడ్నెస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.విశ్వసరావు, కనకదుర్గ వల్లి, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై కూలిన భారీ వృక్షం

గంటపాటు నిలిచిన ట్రాఫిక్



సూర్యారావుపేటలో రోడ్డుపై అడ్డంగా పడి ఉన్న వృక్షం

బోట్‌క్లబ్: తేలికపాటి గాలులకే స్థానిక సూర్యారావుపేటలోని వివేకానంద పార్కు ఎదురుగా ఉన్న చెట్టు గురువారం సాయంత్రం రోడ్డుపై కూలింది. సుమారు గంటపాటు అటుగా వెళ్లాల్సిన బాటసారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ట్రాఫిక్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది స్పందించి చెట్టుకొమ్మలు తొలగించి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చేశారు.